వైన్‌షాపులకు మరో 11 దరఖాస్తులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 94 వైన్‌షాపులకు ఇప్పటి వరకు 162 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో మంగళవారం 11 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 18వ తేదీ చివరి గడువుగా పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆశించిన మేరకు దరఖాస్తులు అందలేదు. గతంలో నిర్వహించిన మద్యం టెండర్లలో చివరి రెండు రోజులే అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. 17, 18 తేదీలలో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

44 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం

- అజ్ఞాతాన్ని వీడిన మల్లోజుల వేణుగోపాల్‌రావు
- దళ సభ్యుడి నుంచి పొలిట్ బ్యూరో వరకు.. ఎదిగిన విప్లవ నేత



మల్లోజుల వేణుగోపాల్ రావు (ఫైల్)

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అజ్ఞాతాన్ని వీడారు. 60 మంది సహచరులతో కలిసి మహారాష్ట్ర గడ్చిరోలి పోలీసులకు మంగళవారం లొంగిపోయారు. ఈ నేపథ్యంలో ఆయన జ్ఞాపకాలను ఉమ్మడి జిల్లా వాసులు నెమరువేసుకుంటున్నారు.. అన్న మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీని స్ఫూర్తిగా తీసుకున్న వేణుగోపాల్‌రావు 1981లో పీపుల్స్‌వార్‌లో చేరారు. అనంతరం అంచలంచెలుగా ఎదిగారు. సాహిత్యాభి రుచి ఉన్న వేణుగోపాల్‌రావు సాధన అనే కలం పేరిట కవిత్వం రాసేవారు. ఉద్యమంలోకి వెళ్లిన తన కుమారులను చూడాలని కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్‌రావు తల్లి మల్లోజుల మధురమ్మ జీవితాంతం ఎదురు చూశారు. 2011లో కిషన్‌జీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. 2022 అక్టోబరులో మల్లోజుల మధురమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. 44 ఏళ్ల క్రితం ఉద్యమంలోకి వెళ్లిన వేణుగోపాల్‌రావు ఇప్పటివరకు ఇంటి ముఖం చూడలేదు. ప్రస్తుతం ఆయన పోలీసులకు లొంగిపోవడాన్ని కుటుంబసభ్యులు స్వాగతిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి

6



సన్న వరి బోనస్ అందేదెన్నడో..?



- నాలుగు నెలలుగా రైతుల ఎదురుచూపులు
- యాసంగి ధాన్యం బోనస్ బకాయి రూ. 62.6 కోట్లు
- వానాకాలంలో జోరుగా సాగు

రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల వరిపై ఐదు వందల రూపాయల బోనస్‌ను ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం నుంచి సన్న రకాల సాగు పెరిగింది. వర్షాకాలంలోనే ఈ రకాలవైపు మొగ్గు చూపే రైతులు యాసంగిలో సాగును పెంచారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 1,25,224 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించారు. దీనికి సంబంధించిన 62.6 కోట్ల రూపాయల బోనస్ రైతులకు రావాల్సి ఉంది. నాలుగు నెలలు గడిచినా ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. వర్షాకాలం పంట కోతలు ప్రారంభమవుతున్నా బోనస్ అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బోనస్ ఇస్తారని దిగుబడి తగ్గినా సన్నరకాలు సాగు చేశామని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి బోనస్‌పై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

-కరీంనగర్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

7

మహిళా యువ క్రికెటర్లకు సువర్ణ అవకాశం

- హెచ్‌సీఏ ఆధ్వర్యంలో అండర్-19 భారత జట్టుకు ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్

7

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

6

'స్మార్ట్‌సిటీ' పనులను డిసెంబరులోగా పూర్తి చేయండి

- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను డిసెంబరు 31లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులు, వీధిదీపాల నిర్వహణ, పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రారంభించి కొనసాగుతున్న డిజిటల్ లైబ్రరీ భవనం, బాలసదన్ భవనం, ఐసీసీసీ భవనం, ఎస్‌వీపీ భవనం ఆధునీకరణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అక్టోబరుతో ఎస్‌వీపీ భవనం ఆధునీకరణ పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. టవర్‌సర్కిల్ రెన్యూవేషన్ అభివృద్ధి పనులను ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా నీటి శుద్ధీకరణ కేంద్రంలో చేపట్టిన మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నల్లా పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఈ రాజ్‌కుమార్, ఈఈలు సంజీవ్‌కుమార్, రొడ్డ యాదగిరి, డీఈలు లచ్చిరెడ్డి, ఓం ప్రకాశ్, అయాజ్‌ఖాన్, దేవేందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే 'షీట్స్' తెరుస్తాం...

- సైబర్ క్రైంలు, మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు
- కరీంనగర్ రూరల్ ఏసీపీ జి విజయ్‌కుమార్



నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ జి విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు, మహిళలపై నేరాలకు పాల్పడిన వారిపై షీట్స్ తెరచి కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఏసీపీ జి విజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి బావుపేటలో పోలీస్ కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా గ్రామప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్, ఎస్‌ఐ సాంబమూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణుల అభిప్రాయాల మేరకే జిల్లా అధ్యక్షుడి ఎంపిక

- ఏఐసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్ మనె

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల అభిప్రాయాల మేరకే జిల్లా అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని, పార్టీ అభివృద్ధికి క్రియాశీలకంగా పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్ మనె అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి నియామక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుల బృందం మంగళవారం కరీంనగర్‌కు వచ్చింది. ఈ సందర్భంగా విలేకరులతో శ్రీనివాస్ మనె మాట్లాడుతూ గ్రామ, డివిజన్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎంపిక విధానంలో నూతన ఒరవడిని సృష్టించిందన్నారు. క్షేత్రస్థాయిలో బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాలు, విభాగాల అధ్యక్షులు, ముఖ్య నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అభిప్రాయ సేకరిస్తున్నామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేవారిని, ప్రజా పాలనలో భాగస్వాములై సమన్వయకర్తగా పని చేయగలిగే వారిని ఎన్నుకునే ఉద్దేశంతో కాంగ్రెస్ ఈ పద్ధతికి శ్రీకారం చుట్టిందని అన్నారు. కార్యకర్తల అభిప్రాయ సేకరణ ముగిసిన తర్వాత ఆ నివేదికను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఇతర ముఖ్య నేతలకు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఐసీసీ పరిశీలకు బృంద సభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఆత్రం సుగుణ, చిట్ల సత్యానారాయణ, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, నాయకులు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, టీపీసీసీ కోఆర్డినేటర్ మ్యాడం బాలకృష్ణ, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, వైద్యుల అంజన్‌కుమార్, ఎండీ తాజ్, పులి ఆంజనేయులుగౌడ్, కర్ర సత్యప్రసన్నరెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, మల్లిఖార్జున రాజేందర్, ఆకుల నర్సయ్య, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, మడుపుమోహన్, పత్తి మధు, పురం రాజేశం, పత్తి కృష్ణారెడ్డి, ముస్తాక్, అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు శ్రీనివాస్ మనె

మహిళా నాయకుల వాగ్వాదం

ఏఐసీసీ పరిశీలకుడు శ్రీనివాస్ మనె డీసీసీ కార్యాలయంలో ఒక వైపు మీడియాతో మాట్లాడుతున్న సమయంలోనే కరీంనగర్ 22వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ఆ డివిజన్ మాజీ కార్పొరేటర్ భర్త, కాంగ్రెస్ నాయకుడు గంట శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగారు. మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు రజితారెడ్డి నగరంలోని డివిజన్ కమిటీలను నియమిస్తున్న క్రమంలో 22వ డివిజన్ నుంచి గడ్డం కొమురమ్మ, సాగరిక పేర్లను పరిశీలించాలని గంట శ్రీనివాస్ కోరారు. దీనిపై ముల్కల కవితతోపాటు షబానా మహ్మద్ అభ్యంతరం తెలిపారు. తాము మొదటి నుంచి పార్టీలో కష్టపడి పనిచేస్తుండగా సీనియర్లను కాదని వేరే వారి పేర్లను ఎలా పరిశీలనకు ఇస్తారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గంట శ్రీనివాస్‌కు కవిత, షబానాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఇతర నాయకులు ఇద్దరికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించివేశారు.

బీపీఎస్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కరీంనగర్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థుల సమస్యలను సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధికారలను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన కలెక్టర్లతో జరిపిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద చదివే విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజును ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. కలెక్టర్లు వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఇబ్బందులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకరావాలని అన్నారు. సంక్షేమ శాఖామంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కలెక్టర్లు, డీఈవోలు, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ పాఠశాలలల యాజమాన్యాలతో చర్చించి విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్, రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామపాలన అధికారుల క్యాడర్ స్ట్రెంత్ మంజూరు చేయాలి



కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందచేస్తున్న జీపీవోలు

సుభాష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారుల క్యాడర్ స్ట్రెంత్ మంజూరు చేయాలని జిల్లా గ్రామపాలన అధికారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ శాఖలలో ఉన్న తమను తిరిగి తమ మాతృ సంస్థ అయిన రెవెన్యూశాఖలో గ్రామపాలన అధికారులుగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్ఏ నుంచి వివిధ శాఖల్లో పదోన్నతులు పొందిన వార్డు ఆఫీసర్లు, రికార్డు అసిస్టెంట్లు, చైన్‌మెన్, ఆఫీస్ సబార్డినేట్లు రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నారని తెలిపారు. వారి సర్వీసును క్రమబద్ధీకరించి ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఊట్ల కృష్ణ, తమ్మిశెట్టి ఆంజనేయులప్రసాద్, నలువాల సాయి కిషోర్, అందె రవీందర్, వీర్ల రేవంత్ కుమార్, కుమ్మరి హరీష్, నూనె రమేశ్, వడ్లకొండ శ్రీనివాస్, వెంకటస్వామి, సురేష్, సాగర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్, ఎక్సైజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, వైద్య, తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణా మాలపై పాఠ శాలలు, కళాశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, విద్యాధికా రులు కలిసి రోడ్ల పక్కన పాఠశాలలు, పాన్ షాపుల్లో తనిఖీలు చేయాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచిం చారు. అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలన్నారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సంస్థలతోపాటు ఆన్‌లైన్ సంస్థలకు సంబంధించి గోదాములను తనిఖీ చేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నశా ముక్త్‌భారత్ అభియాన్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, డీడబ్ల్యూవో సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ అలం, అధికారులు

ఆరోగ్యమహిళ పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి

సుభాష్‌నగర్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్న పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. మంగళవారం నగరంలోని సప్తగిరి కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళ పరీక్షల రికార్డులను పరిశీలించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలను పక్కాగా నమోదు చేసి వారికి ప్రతినెల మందులు అందజేయాలని ఆదేశించారు. ప్రైవేటు మందుల షాపుల్లో లభించే అన్ని మందులను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందజేస్తారని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో రీస్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. గర్భిణు లకు క్రమం తప్పకుండా బరువు చూస్తు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలన్నారు.ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ వాహనంలో 2డి ఎకో, ఎక్స్‌రే, మమ్మోగ్రఫీ పరీక్షల తీరును కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యశాఖ ప్రోగ్రామ ఆఫీసర్ సనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుబ్బపల్లిలో ఓ ఇంట్లో నిల్వ చేసిన 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి వివరాల ప్రకారం.. దుబ్బపల్లిలోని కర్రె గంగారాం కొంత కాలంగా మహారాష్ట్రలోని పౌల్ట్రీ ఫాంలకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న సీఐ కొద్ది రోజులుగా నిఘా ఏర్పాటు చేశారు. పక్కా సమాచారంతో సోమవారం దుబ్బపల్లిలోని గంగారాం ఇంట్లో సోదాలు చేశారు. 629 బస్తాలలో 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వలు గుర్తించారు. ఇంటి యజమాని గంగారాంను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. గంగారం కరీంనగర్ చుట్టుపక్కల ప్రజల వద్ద తక్కువ ధరకు పీడీఎస్ బబియ్యం సేకరిస్తున్నట్లు, నెలకు 200 క్వింటాళ్లు జమచేసి లారీ ద్వారా మహారాష్ట్రకు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. 300 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించినట్లు, నిందితుడు గంగారంపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు. పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై నరేష్, సిబ్బందిని సీపీ గౌస్ ఆలం అభినందించారు.

చిట్‌ఫండ్ సిబ్బంది వేధింపులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): డబ్బులు చెల్లించాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ వ్యక్తి ఇంటికి ఓ చిట్ ఫండ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం చేరుకుని వేధింపులకు దిగారని స్థానికులు పేర్కొన్నారు. ఇంటి ఎదుట సిబ్బంది వ్యవహరించిన తీరుపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నిబంధనల మేరకు బాధితుడి నుంచి డబ్బులు వసూలు చేసుకోవాలని ఇంటికి వచ్చి ఇబ్బందులకు గురి చేయకూడదని పోలీసులు సూచించారు. ఇంటి ఎదుట గొడవకు దిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాంతో చిట్ ఫండ్‌కు చెందిన వ్యక్తులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

- 24మందికి జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు

కోల్‌సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 24 మందికి రూ.48వేల జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను గోదావరిఖని రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ గురువ విధించినట్టు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బీ రాజేశ్వర్‌రావు తెలిపారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడగా అతనికి మూడు రోజుల జైలు శిక్ష విధించి కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

44 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం

అజ్ఞాతాన్ని వీడిన మల్లోజుల వేణుగోపాల్‌రావు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర కమిటీ సభ్యుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్ మెంబర్, అధికార ప్రతినిధి, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ చీఫ్ మల్లోజుల వేణుగోపాల్ అలి యాస్ సోనూ దాదా, అభయ్, భూపతి 44 ఏళ్ల అజ్ఞాతాన్ని వీడారు. ఆయనను పెద్దపల్లి పెద్దన్నగా ఈ ప్రాంత ప్రజలు భావిస్తారు. మంగళవారం రాష్ట్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, రూపేష్, పలువురు డివిజనల్ కమిటీ సభ్యులు 60 మంది మావోయిస్టులతో కలిసి మహారాష్ట్ర గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు.

● వరుస లేఖలతో కలకలం

రెండు నెలలుగా పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ మల్లోజుల విడుదల చేసిన లేఖలు కలకలం రేపాయి. ఆ లేఖలకు ప్రతిగా రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్, కేంద్ర కమిటీ సభ్యులు కట్ట రాంచంద్రా రెడ్డి, సత్యనారాయణరెడ్డి సాయుధ పోరాటాన్ని వీడేది లేదంటూ స్పష్టం చేశారు. ఆ తర్వాత మల్లోజుల వరుసగా లేఖలు విడుదల చేయడంతో ఆయన లొంగిపోవడం ఖాయమని అంతా భావిం చారు. వారం రోజుల క్రితమే ఆయన హైదరాబాద్ పోలీసులకు లొంగిపోయారనే వార్తలు వెలువడ్డాయి. వేణుగోపాల్‌రావు సోదరుడు కోటేశ్వర్‌రావు విప్లవోద్య



మల్లోజుల వేణుగోపాల్‌రావు (ఫైల్)

● దళ సభ్యుడి నుంచి పొలిట్ బ్యూరో వరకు

మంలోనే అమరుడయ్యారు. ఆ సమయంలో 'అమ్మ.. నేను పారి పో ను, ప్రజల కోసం ప్రాణం ఇస్తా..' అని అన్న వేణు గోపాల్‌రావు అనూహ్యంగా పోలీసులకు లొంగి పోవడం చర్చనీయాంశంగా మా రింది. నిన్ను చూడాలంటూ.. పలు సార్లు కోరిన వేణుగో పాల్‌రావు తల్లి మల్లోజుల మధురమ్మ 2022 అక్టోబరులో అనారోగ్యంతో మృతి చెందింది. ఆ సమ యంలో ఆయన వస్తాడని పలువురు భావించారు.

● కోటన్న స్ఫూర్తిగా..

పెద్దపల్లి పట్టణానికి చెందిన మధురమ్మ, వెంక టయ్య దంపతులకు మూడో సంతానంగా 1956 మే 10వ తేదీన మల్లోజుల వేణుగోపాల్ రావు జన్మించారు. పెద్దన్న ఆంజనేయులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉద్యో గం చేసి పదవీ విరమణ చేశారు. పెద్దపల్లి ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాలు, భూస్వాములు, పెత్తందారుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ 1975లోనే కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో ఏర్పడిన సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌లో చేరారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకున్న వేణుగోపాల్ రావు 1981 ప్రాంతం లో అడవిబాట పట్టారు. పెద్దపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. 1977-78లో పెద్దపల్లి ఐటీఐలో రేడియో టీవీ కోర్సును అభ్యసించారు. అనంతరం బసంత్‌నగర్‌లో గల సిమెంట్ ఫ్యాక్టరీలో అప్రెంటీస్‌షిప్ చేశారు. ఆ తర్వాత బీకాం చదివారు.

● అంచలంచెలుగా ఎదిగి..

మల్లోజుల వేణుగోపాల్ పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీల్లో అంచలంచెలుగా ఎదిగారు. 1981లో పీపుల్స్‌వార్‌లో ఏటూరు నాగారం దళ సభ్యుడిగా చేరారు. 1982లో మహదేవపూర్ పోలీసులు అరెస్టు చేశారు. 1983లో విడుదలైన తర్వాత తిరిగి దళంలోకి వెళ్లారు. 1993లో దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సెక్రెటరీగా, 1995లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్ని కయ్యారు. పశ్చిమ కనుమలకు ఇరువైపులా కొత్త గెరిల్లా జోన్ ఏర్పాటు చేసేందుకు వేణుగోపాల్‌రావుకు పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. 2007 నుంచి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా పని చేస్తున్నారు. 2010 ఏప్రిల్‌లో దంతేవాడలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతిచెందిన ఘటనకు ప్రధాన సూత్రధారి వేణుగోపాల్ అని చెబుతారు. అదే ఏడాది కేంద్ర అధికార ప్రతినిధిగా నియమించారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా వేణుగోపాల్ బాధ్యతలు నిర్వహించారు. అభయ్ పేరిట లేఖలు విడుదల చేసేవారు. లాల్‌గఢ్ ప్రాంత ఉద్యమానికి, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా నాయకత్వం వహించారు. ఆయన సహచరి సిడాం విమలచంద్ర అలియాస్ తారక్క అలియాస్ వత్సల జనవరి 1న మహా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎదుట లొంగిపోయారు. సాహిత్యాభిరుచి ఉన్న వేణుగోపాల్ సాధన అనే కలం పేరిట కవిత్వం రాసే వారు.

జనజీవన స్రవంతిలోకి రావడం ఆనందంగా ఉంది..

- మల్లోజుల దిలీప్ శర్మ, వేణుగోపాల్ సోదరుడి కుమారుడు



మా బాబాయ్ అడవులను వీడి జన జీవన స్రవంతిలో కలవడం ఆనందంగా ఉంది. ఆయన ఎలా ఉంటారో ఇప్పటి వరకు నేను చూడ లేదు. ఆయన జన జీవన స్రవంతిలో కలవడాన్ని కుటుంబసభ్యులందరం స్వాగతిస్తున్నాం..

● అజ్ఞాతంలో అగ్ర నేతలు..

పెద్దపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు ఉద్యమానికి కీలకంగా నిలిచిన ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అగ్రనేతలు పార్టీలో కొనసాగుతున్నారు. కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలోని పీపుల్స్‌వార్ పార్టీలో ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున యువకులు చేరారు. పెద్దపల్లికి చెందిన మల్లోజుల కోటేశ్వర్ రావు, మల్లోజుల వేణుగోపాల్ రావు, బీర్‌పూర్‌కు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు, కొత్తగట్టుకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేష్, కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి, మంథని శాస్త్రులపల్లికి చెందిన మల్ల రాజిరెడ్డి, మంగపేటకు చెందిన బుర్ర చిన్నన్న, దమ్మక్కపేటకు చెందిన ఏకే కొమురయ్య, గూడెం ప్రసాద్, వడుకాపూర్‌కు చెందిన పుల్లూరి ప్రసాదరావు, పద్మక్క, ఇలా అనేక మంది కుటుంబాలను



వదిలి అడవి బాట పట్టారు. కొండపల్లి సీతరామయ్య తర్వాత పీపుల్స్‌వార్ ప్రధాన కార్యదర్శిగా కేంద్ర కమిటీ ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి నియమితులయ్యారు. 2004లో సీపీఐ మావోయిస్టు పార్టీ ఆవిర్భావానికి ముందు 15 ఏళ్ల పాటు గణపతి కార్యదర్శిగా కొనసాగారు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా 2004 నుంచి 2018 వరకు పని చేశారు. ఈ ఏడాది మేలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఉద్యమ ప్రస్థానంలో పలువురు అమరులయ్యారు. పొలిట్ బ్యూరో సభ్యుడు ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యులు మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి అజ్ఞాతంలో ఉన్నారు.

ఏసీబీ వలలో సర్వేయర్

- 3 ఎకరాల భూమి సర్వేకోసం రూ. 30 వేల లంచం
- సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో పట్టివేత



సర్వేయర్ వేణుగోపాల్, అసిస్టెంట్ సూర్యవంశీ



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరో అవినీతి అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిరిసిల్ల ఎమ్మార్వో కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న మేడిశెట్టి వేణుగోపాల్, ప్రైవేట్ అసిస్టెంట్ సూర్యవంశీ మంగళవారం లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలలో చిక్కారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇరుకుల్ల ప్రవీణ్ చిన్న బోనాలలో ఉన్న తన 3 ఎకరాల భూమి సర్వే నిమిత్తం సర్వేయర్ వేణుగోపాల్‌ను సంప్రదించారు. అయితే సర్వే చేసి రిపోర్ట్ ఇవ్వడానికి వేణు ఏకంగా రూ. 30 వేలు డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం మూడు ఎకరాల భూమి సర్వే అయ్యాక ప్రవీణ్ మొదటగా రూ. 10 వేలు లంచం ఇచ్చాడు. మంగళవారం సర్వేయర్ ఫోన్ చేసి బ్యాలెన్స్ ఇస్తే రిపోర్ట్ ఇస్తా అని చెప్పడంతో సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయానికి ప్రవీణ్ వెళ్లి సర్వేయర్‌కు రూ.20 వేలు లంచం ఇస్తుండగా ప్రైవేట్ అసిస్టెంట్ సూర్య వంశీకి ఇవ్వమని చెప్పగానే ఏసీబీ అధికారులు దాడి చేసి ఇద్దరిని పట్టుకున్నారు. సర్వేయర్ వేణుగోపాల్, అసిస్టెంట్ సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ సర్వేయర్‌పై గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం బుధవారం ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఏసీబీ అధికారులు దాడులు మిగతా శాఖల అధికారులను కుదిపివేసింది.

కిరాణా దుకాణాల్లో పోలీసులు సోదాలు



కిరాణ దుకాణంలో పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణ్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని కిరాణ దుకాణాల్లో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు మంగళవారం సోదాలు నిర్వహించారు. సారా తయారీకి వినియోగించే ముడి సరుకులు, గడువు ముగిసిన తినుబండారాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు జరిపారు. సరుకులు, ఇతర వస్తువుల అమ్మకాలకు సంబంధించిన వివరాల పట్టికలు కొనసాగిస్తున్నారా..? అని నిర్వాహకులను ప్రశ్నించారు. దుకాణంలో విక్రయించే వస్తువు వివరాలను నమోదు చేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబా ముడి సరుకులు, జీరో వ్యాపారాలు నిర్వహిస్తే తమకు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. వ్యాపారులు నిబంధనలను ఉల్లఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్‌ఐ లక్ష్మణ్ హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మంథని, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి గ్రామశివారులో ఇటుక బట్టి పరిసరాల్లో స్వర్ణపల్లి గ్రామానికి చెందిన ఉక్కు మహేష్(25) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇటుక బట్టీలో మోటారు మరమ్మతు కోసం సోమవారం సాయంత్రం మహేష్ అక్కడికి వచ్చాడు. పని అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయిన మహేష్ నీటి సంప్‌లో పడి మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే బహిర్భూమికి వెళ్లిన క్రమంలో ఫిట్స్ వచ్చి సంప్‌లో పడి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి



బావు కొమురయ్య

సుల్తానాబాద్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు శాస్త్రినగర్‌లో రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందాడు. పూసాల గ్రామానికి చెందిన బావు కొమురయ్య(79) మంగళవారం మధ్యాహ్నం శాస్త్రినగర్‌లో గల ఒక బ్యాంకులోకి వెళ్లి డబ్బులు డ్రా చేసుకుని తిరిగి రోడ్డు దాటుతున్నాడు. ఆర్టీసీ బస్సు అతన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వృద్ధుడు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. కుటుబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

వేములవాడ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఎయిర్‌టెల్ సెల్ టవర్‌కు మంటలు వ్యాపించిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం అర్ధరాత్రి ఎయిర్‌టెల్ సెల్ టవర్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన స్థానికులు ఆర్పివేసినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు

చందుర్తి అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి ఎస్సై రమేష్ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున ఏఎస్‌ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కిష్టంపేట గ్రామంలో పోలీసులను చూసి ఇసుక ట్రాక్టర్‌ను వదిలేసి పారిపోయిన కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన సద్దుల, అలియాస్ పత్రి పవన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి



వల్లెపు రాకేష్(ఫైల్)

సైదాపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని గొడిశాల గ్రామానికి చెందిన వల్లెపు సంపత్ -పద్మల కుమారుడు వల్లెపు రాకేష్(25) అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12న రాత్రి రాకేష్ సినిమాకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమ బంధువులు, చుట్టుపక్కల ఇళ్లలో వెతికారు. రాకేష్ ఆచూకీ తెలియక పోవడంతో ఈ నెల 13న రాకేష్ కనపడడం లేదని సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం గొడిశాల గ్రామ సమీ పంలోని వ్యవసాయ బావిలో రాకేష్ మృతదేహం లభ్యమైందని తెలిపారు. తమ కొడుకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మృతి చెందాడని రాకేష్ తండ్రి వల్లెపు సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను తీగల గుట్టపల్లి రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన కొత్తూరి రాజ్‌కుమార్, కొమురయ్య, సంపత్, అరవింద్, ఏలవేని వేణుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

వేములవాడ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపురం శివారు ప్రాంతంలో మంగళవారం వాగులో నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. కొద్ది రోజులుగా తిప్పాపురం వాగులో నుంచి వందలాది ట్రాక్టర్ల ఇసుక తరలిస్తూ చాలా ఇబ్బంది కలిగిస్తున్నారని రైతులు వాపోయారు. గుడి అభివృద్ధికి స్మశాన వాటిక ఇసుకను తరలించడం సరికాదని అన్నారు. వందలాది ట్రాక్టర్ల ఇసుక తరలించడం ఈ ప్రాంత రైతులకు ఎంతో నష్టాన్ని కలిగిస్తుందని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి తకు తగిన న్యాయం చేయాలని రైతులు కోరారు.

భూ తగాదాలతో పత్తి పంట ధ్వంసం



ధ్వంసం చేసిన పత్తి పంటతో కిషన్ నాయక్ దంపతులు

ధర్మారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతో రెండు ఎకరాల పత్తి పంటను ధ్వంసం చేసిన ఘటన ధర్మారం మండలంలోని బొమ్మరెడ్డిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. మండలంలోని లంబాడితండా (బి) గ్రామస్థుడైన ఇస్లావత్ కిషన్‌నాయక్ 15 సంవత్సరాలుగా బొమ్మరెడ్డిపల్లి శివారులోని సర్వే నంబర్ 679లో దాదాపు 3 ఎకరాల భూమి సాగు చేస్తున్నాడు. సర్వే నంబర్ 679 ఆనుకొని ఉన్న 680 సర్వే నంబర్‌లో బంజేరుపల్లి గ్రామానికి చెందిన కుర్మ, యాదవ కుటుంబాలకు చెందిన దాదాపు 100 ఎకరాల పట్టా భూమి ఉంది. కాగా 679 సర్వే నంబర్‌లో ఇస్లావత్ కిషన్ నాయక్ సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి కూడా 680 సర్వే నంబర్‌కు సంబంధించిన పట్టా భూమి అంటూ పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ విషయమై ఇరువర్గాలు జూలైలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా పెద్ద మనుషుల సమక్షంలో సర్వే చేయించి భూమి సర్దుబాటు చేసుకుంటామని ఒప్పందపత్రం రాసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం భూమి వద్ద పత్తిచేను, బీర పంటలకు సాగు పనులు చూసుకొని సాయంత్రం వరకు ఇంటికి వచ్చామని, సోమవారం మధ్యాహ్నం వెళ్లి చూసే సరికి 2 ఎకరాల పత్తి పంటతో పాటు 20 గుంటల బీర తోట కోసేసి ఉందని కిషన్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై బంజేరుపల్లిలోని కొందరు పేర్లు పేర్కొంటూ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు కిషన్ నాయక్ పిర్యాదు చేశారు. భూ తగాదా పెద్ద మనుషుల సమక్షంలో ఉండగా ఇలా చేతికొచ్చిన పంటను కోయడం దారుణమని రైతు రోదించాడు. పత్తిపంట కోయడంతో తనకు లక్షా అరవై వేల రూపాయల నష్టం జరిగిందని, పంట నష్టం చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కిషన్‌నాయక్ కోరాడు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ముకరంపుర ప్రాంతంలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న కట్టరాంపూర్‌కు చెందిన ఉప్పుల వెంకటరాజం అనే వ్యక్తితో పాటు గృహ యజమాని రిజ్వాన్‌లపై కేసు నమోదు చేశామని కరీంనగర్ వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. ముకరంపుర ప్రాంతంలో వ్యభిచారం నడుస్తోందనే పక్కా సమాచారంతో ఆ గృహంపై దాడి చేయగా నిర్వాహకుడు, అతనికి సహకరించిన ఇంటి యజమానితో పాటు ముగ్గురిని పట్టుకున్నామని తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 1,100 రూపాయలు, సెల్‌ఫోన్‌లు తదితరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగిం చారు. శివరాజ్ అనే వ్యక్తి సెప్టెంబరు 9న బొమ్మకల్‌లో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులకు పిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నిలజీతో ఫోన్ హైదరాబాద్‌లో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం శివరాజ్‌కు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఆరు నెలల క్రితం మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్న ఇద్దరు బాధితులైన ఎల్‌ఎండీ కాలనీకి చెందిన పెండ్యాల సుధాకర్, చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన అనిల్ కుమార్‌లకు మంగళవారం ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఫోన్‌లను అప్పగించారు. ఎవరైనా తమ మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్నట్లయితే సిఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సూచించారు.

పాన్‌షాపులో చోరీపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని పాన్‌షాపులో చోరీ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఖరీఫ్ రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో పాన్‌షాపు నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ నెల 13న రాత్రి తాళం వేసి ఇంటికి వెళ్లి తిరిగి ఈ నెల 14న ఉదయం పాన్ షాపుకు చేరుకున్నాడని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులకొట్టి అందులోని రూ.10 వేల విలువైన సిగరేట్ డబ్బాలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. బాధితుడు మహ్మద్ ఖరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

మహిళా యువ క్రికెటర్లకు సువర్ణ అవకాశం

- హెచ్‌సీఏ ఆధ్వర్యంలో అండర్-19 భారత జట్టుకు ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్



కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) యువ మహిళా క్రికెటర్లకు సువర్ణావకాశం కల్పిస్తోంది. భారత అండర్-19 మహిళా క్రికెట్ జట్టులో చోటు కోసం ఈ నెల 15, 16 తేదీల్లో ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇందులో ప్రతిభ చాటిన మహిళా క్రికెటర్లు 2025-26 సీజన్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొంది. పోటీల్లో పాల్గొనాలనుకునే మహిళా క్రికెటర్లకు అర్హతలను వెల్లడించింది.

● రిజిస్ట్రేషన్ వివరాలు

- ఈ నెల 15న ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. - మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రయల్స్. - ఈ నెల 16న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు రిజిస్ట్రేషన్, ట్రయల్స్ ప్రక్రియ.

● వేదిక

- హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ట్రయల్స్ నిర్వహిస్తారు.

- జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులు ఈ నెల 15న రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోనట్లైతే ఈనెల 16న నేరుగా హాజరై ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది.

● అర్హత

పోటీల్లో పాల్గొనేందుకు 1-9-2006 లేదా ఆ తరువాత జన్మించిన క్రికెటర్లకు మాత్రమే అవకాశం.

● పాటించాల్సిన నిబంధనలు

ఉప్పల్‌లోని స్టేడియం గేట్-1 వద్ద క్రీడాకారులు రిపోర్ట్ చేయాలి. ప్రతీ ఒక్కరు తమ క్రికెట్ కిట్, తెలుపురంగు దుస్తులు వెంట తెచ్చుకోవాలి. గుర్తింపు పత్రాలను తప్పక తీసుకురావాలి. వయస్సు ధ్రువీకరణ పత్రం ఒరిజినల్ డిజిటల్ కాపీతోపాటు ఒక జిరాక్స్ కాపీ, ఒరిజినల్ ఆధార్‌కార్డుతోపాటు ఒక జిరాక్స్ కాపీ, ఒక పాస్‌పోర్టుసైజు ఫొటో వెంట తెచ్చుకోవాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగమ్‌రావు, ఎన్.మురళీధర్‌రావు సూచించారు.



సన్న వరి బోనస్ అందేదెన్నడో..?

● నాలుగు నెలలుగా రైతుల ఎదురుచూపులు
● యాసంగి ధాన్యం బోనస్ బకాయి రూ. 62.6 కోట్లు
● వానాకాలంలో జోరుగా సాగు

కరీంనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించింది. సాధారణంగా వానాకాలంలో మాత్రమే సన్న రకం వరి రైతులు సాగు చేస్తారు. యాసంగిలో వరి గింజ తయారయ్యే దశలో ఎండలు ముదిరి నీరందక తాలు పోయే అవకాశమున్నందున ఆ సీజన్‌లో సన్న రకాలను సాగు చేసేందుకు ఆసక్తి చూపించరు.

● ఆందోళనలో అన్నదాతలు

వానాకాలంలో సీజన్‌లో రైతులు తాము ఇంటి అవసరాలకు వినియోగించుకోవడానికే కాకుండా మార్కెట్‌లో విక్రయించేందుకు తమ సాగు విస్తీర్ణంలో సుమారు 25 శాతం సన్న వరి రకాలను సాగు చేస్తారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈసారి 40 శాతం మేరకు సన్న రకాలను సాగు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వానాకాలంలో రైతులు 4.2 లక్షల ఎకరాల్లో సన్న రకాలను సాగు చేశారు. ఎకరాకు కనీసం 20 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుంది. ఈ మేరకు సుమారు 8.4 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకాలను ఈసారి రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. వర్షాకాలంలో సాగు చేసిన వరి ధాన్యం మిల్లింగ్ సమయంలో నూకగా మారదు. దీంతో మిల్లర్లు ఎక్కువ ధర చెల్లించి ఈ ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం అందించే బోనస్ ప్రోత్సాహకరంగా ఉన్న నేపథ్యంలో ఒక్కో క్వింటాల్‌పై 500 రూపాయలు అధికంగా వస్తున్నందున రైతులు పెద్ద ఎత్తున సన్న రకాలను సాగు చేశారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తయి నాలుగునెలలు గడిచినా బోనస్ డబ్బును ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వానాకాలంలో బోనస్ ఇస్తుందా లేదా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బోనస్ ఇస్తేనే ప్రైవేట్ మార్కెట్ లో మిల్లర్లు అంతకంటే ఎక్కువ రేటు చెల్లించేందుకు ముందుకు వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వం బోనస్ ఇవ్వక పోతే మిల్లర్లు ఆ బోనస్ డబ్బుల కంటే తక్కువగా చెల్లించి కొనుగోలు చేస్తారు. దీంతో రైతులు ఆశించిన విధంగా సన్న వరి రకాలకు ధర పలక దని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాసంగి వరి ధాన్యం బోనస్ బకాయిల ను చెల్లించడంతో పాటు వానా కాలం బో నస్‌పై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

● ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యాసంగిలో 1,25,224 మెట్రిక్ టన్నుల దిగుబడి

ప్రభుత్వం క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో రైతులు ధైర్యం చేసి సన్నరకాల సాగును పెంచి 1,25,224 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించి కొనుగోలు కేంద్రాలకు విక్రయించారు.కరీంనగర్ జిల్లాలో 32,694, పెద్దపల్లి జిల్లాలో 79,345, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 8,786, జగిత్యాల జిల్లాలో 4,399 మెట్రిక్ టన్నులల సన్న రకం వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి విక్రయించారు. ఈ ధాన్యానికి సంబంధించిన డబ్బును ప్రభుత్వం ఆయా రైతుల ఖాతాల్లో 15 రోజుల్లోగానే జమ చేసింది. ప్రోత్సాహకంగా ఇస్తామన్న క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్‌ను మాత్రం ఇప్పటికీ చెల్లించలేదు. కరీంన గర్ జిల్లా రైతులకు 16.35 కోట్లు, పెద్దపల్లి జిల్లా రైతులకు 39.67 కోట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులకు 4.62 కోట్లు, జగిత్యాల జిల్లా రైతులకు 2.21 కోట్ల రూపాయల బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉన్నది. జూన్ మొదటి వారంలోగానే యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. నాలుగు నెలలుగా రైతులు బోనస్ డబ్బులు జమ కాక ఇబ్బంది పడుతున్నారు. వాన కాలం సాగు అవసరాలకు ఈ డబ్బు ఉపయోగపడుతుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకు ఆ డబ్బును ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఎప్పుడు విడుదల చేస్తుందనే విషయం కూడా అధికారులు తెలపడం లేదు. నాలుగు నెలలు గడిచినా బోనస్ అందక పోవడంతో అసలు ఆ డబ్బు ఇస్తారా లేదా అనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

17న రాజన్న కోడెల పంపిణీ

- కలెక్టర్ ఎం. హరిత

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ తిప్పాపూర్ గోశాలలోని రాజన్న కోడెలను ఈ నెల 17వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. గోశాలలోని 200 జతల కోడెలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసామని అన్నారు. రాజన్న సిరిసిల్లతో పాటుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులు అర్హులైన రైతులకు అందించాలని స్పష్టం చేసినట్లు తెలిపారు. కోడెలు కావాల్సిన రైతులు జిల్లా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ఐతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు సంబంధిత ధృవపత్రాలతో వివరాలు ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని అన్నారు. కోడెలకు కోసం వచ్చే సమయంలో సంబంధిత పత్రాలు వెంట తీసుకు రావాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకుని, కోడెలను తీసుకోని వారు సరైన పత్రాలతో రావాలని కోరారు. రైతులకు అందించిన కోడెలకు జియో ట్యాగింగ్ ఉంటుందని, కోడెలు వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణం పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలు పక్కదారి పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం

- రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి



ఎమ్మెల్యే కవ్వంపల్లి వినతిపత్రం అందిస్తున్న రేవా నాయకులు

తిమ్మాపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రయోజనాలు వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తాం అని రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంగా ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు రావలసిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత వెంటనే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని వాపోయారు. ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవినపెడుతుందని ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకేశాల ప్రభాకర్ రావు మాట్లాడుతూ పెన్షన్ బకాయిలు రాక ఇప్పటివరకు రాష్ట్రంలో 16మంది పెన్షనర్లు చనిపోయారని చాలామంది అనారోగ్యంతో హస్పిటల్‌లో డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో దీనావస్థలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకేశాల ప్రభాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గద్దె జగదీశ్వర చారి, కోశాధికారి కనపర్తి దివాకర్, పాలోజు రవీందర్, జాలి మహేందర్‌రెడ్డి, బూరుపల్లి రవీందర్,, వీరగోని చంద్రమౌళి, గోగురామన్న, పెరిక నర్సయ్య, కరుణకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ద్వితీయ స్థానం



ప్రహర్షిక

మానకొండూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రహర్షిక రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలలో ద్వితీయ స్థానం సాధించింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు జరిగాయి. ఈ పోటీలలో జిల్లా స్థాయి జట్టులో సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రహర్షిక రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మోడల్ సాధించింది. కాగా గురువారం పాఠశాలలో ప్రహర్షికను ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అద్యాపక బృందం అభినందించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడి నెలకొనగా వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాల పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఉపాధ్యాయుడి ఎంపిక



అభయ్‌రాజ్

రాయికల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పరిశోధనా శిక్షణ సంస్థ 'విద్యార్థుల యొక్క విద్యాపరమైన అభివృద్ధిలో కౌన్సెలింగ్ యొక్క పాత్ర' అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా పరిశోధన పత్రాలు ఆహ్వానించారు. రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్ రూపొందించిన పరిశోధనా పత్రం 'ఒత్తిడి నుంచి విజయం వైపు-సమస్యల నుంచి పరిష్కారాల వైపు' ఎంపికైంది. ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే సెమినార్‌లో అభయ్‌రాజ్ తన పరిశోధనా పత్రం ప్రదర్శించనున్నారని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు తెలిపారు.

గర్షకుర్తిలో యునిసెఫ్ బృందం పర్యటన



గ్రామస్థులతో మాట్లాడుతున్న జాతీయ యూనిసెఫ్ బృందం

గంగాధర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకర్తిలో మంగళవారం యూనిసెఫ్ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. విద్యాలయాల్లో పరిశుధ్య పద్ధతులు, మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థుల చేతులను సబ్బుతో కడుక్కోవడం వంటి అలవాట్లను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థులతో పారిశుధ్యం, శుభ్రతపై వివరించారు. తడిపొడి చెత్తను వేరు చేయడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వ్యక్తి గత పరిశుభ్రత ఆరోగ్యాన్ని కాపాడుతుందని వివరించారు. బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని అందించాలని అన్నారు. బుధవారం నిర్వహించే గ్లోబల్ హాండ్ వాష్ డే సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మూడు రాష్ట్రాల యూనిసెఫ్ ఇన్‌చార్జి వెంకటేశ్, తెలంగాణ ఇన్‌చార్జి పణీకుమార్, జిల్లా ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రమేష్‌వేణుప్రసాద్, ఎంపీడీవో రాము, ఎంపీవో గౌరీ రమేష్, కార్యదర్శులు, వీవోలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాజన్న కోడెల గడ్డి మాయం



నాంపల్లిలో నిల్వ చేసిన వరి గడ్డి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజన్న కోడెల కోసం భక్తులు వందల కిలోమీటర్ల నుంచి తీసుకువచ్చిన ఎండు గడ్డి కట్టలను కొంత మంది స్థానికులు గుట్టుచప్పుడు కాకుండా మాయం చేస్తున్నారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి కోడెలకు రైతులు భక్తితో ఎండు గడ్డి కట్టలను విరాళంగా అందజేస్తారు. అలా వచ్చిన ఎండు గడ్డి కట్టలను మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామ శివారులో ఆలయాధికారులు నిల్వ చేశారు. అయితే నిల్వ చేసిన గడ్డి పక్కదారి పట్టకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో అనుపురం, నాంపల్లి గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు రాజన్న కోడెల ఎండు గడ్డి కట్టలను మాయం చేస్తున్నారనే ఆరోపణలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. అంతే కాకుండా నిల్వ చేసిన గడ్డికట్టలపైకి ప్రైవేటు జీవాలను వదిలేసి వెళుతున్నారని తెలుస్తోంది. దీంతో రాజన్న కోడెల ఎండు గడ్డి కట్టలు పక్కదారి పట్టకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆది శ్రీనివాస్



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, విస్తరణ పనుల తీరుతెన్నుల గురించి, కలికోట సూరమ్మ రిజర్వాయరు నిర్మాణ పనులపై చర్చించినట్లు తెలిపారు.

ఆస్తి తీసుకుని అన్నం పెట్టడం లేదు

● పోలీస్‌స్టేషన్‌లో కొడుకుపై తల్లిదండ్రుల ఫిర్యాదు



హుజూరాబాద్‌లో పోలీస్‌స్టేషన్ వద్ద రాజిరెడ్డి-ప్రమీల వృద్ధ దంపతులు

హుజూరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని తీసుకొని వృద్ధాప్యంలో అన్నం పెట్టకపోవడంతో కొడుకుపై వృద్ధ దంపతులు మంగళవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గుర్రాల రాజిరెడ్డి-ప్రమీల దంపతులు వృద్ధాప్యంలో ఉన్నారు. వీరికి ఒక కొడుకు, కూతురు ఉండగా, వారికి వివాహం జరిపించారు. రాజిరెడ్డి తనకున్న సుమారు ఐదెకరాల భూమిని కొడుకు మహేందర్‌రెడ్డిపై రిజిస్ట్రేషన్ చేశారు. కొన్ని రోజులు తల్లిదండ్రులను సక్రమంగా చూసుకున్న కొడుకు, కోడలు ఇటీవల పట్టించుకోవడం మానేశారు. ప్రస్తుతం రాజిరెడ్డి, ప్రమీలలు వృద్ధాప్యంలో ఉండగా, ఆరోగ్యం సహకరించడం లేదు. నెలకు రూ. 2వేల పింఛన్ రావడంతో దానిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కొడుకు, కోడలు పట్టించుకోకపోవడంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. దీనిపై టౌన్ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ కొడుకు మహేందర్‌రెడ్డిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, తల్లిదండ్రులను చూసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం



రాచర్లబొప్పాపూర్‌లో తడిసిన ధాన్యం

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో మంగళవారం వేకువ జామున వర్షం కురిసింది. మండల కేంద్రాలతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, పదిర, హరిదాస్‌నగర్, రంగంపేట, తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యపు కుప్పలపై కప్పిన కవర్లలో నిలిచిన వర్షపు నీరును రైతులు తొలగించారు. తడిసిన ధాన్యాన్ని వేరు చేసి ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడ్డారు. కొనుగోళ్లను వేగవంతం చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాజీవ్ రహదారిపై వెలుగని సెంట్రల్ లైటింగ్

● చాలా చోట్ల పనిచేయని లైట్లు ● రాత్రివేళ ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అలుగునూర్ వద్ద రాజీవ్ రహదారిపై వెలగని లైటింగ్

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-హైదారాబాద్ వెళ్లే రాజీవ్ రహదారిపై అలుగునూర్ నుంచి మహాత్మానగర్ వరకు సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ పనిచేయడం లేదు. సెంట్రల్ లైటింగ్ పూర్తి స్థాయిలో వెలగకపోవడంతో రాత్రి సమయంలో ఈ రహధారి వెంబడి ప్రయాణించేందుకు వాహణాదారులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం రాత్రి కూడా అలుగునూర్ నుంచి టోల్‌గేట్ హోటల్ వరకు దాదాపు 30 పోల్స్‌కు సంబంధించిన సెంట్రల్ లైటింగ్ వెలగ లేదు. ఎప్పుడూ రద్దీగా ఉండే రాజీవ్ రహదారి వెంట నిత్యం వందల సంఖ్యలో వివిధ రకాల వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. రోడ్డుపై ఉన్న వివిధ గ్రామాల ప్రజలు రోడ్డు వెంట నడవాలన్నా భయపడుతున్నారు. అతివేగంగా రహదారిపై నుంచి వచ్చే వాహనాలతో చీకట్లో ఎక్కడ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ చీకట్లో సరిగా దారి తెలియక, మూలమలుపులు కూడా ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో, ముందు ఏ వాహనం ఆగి ఉందో తెలియని పరిస్థితి మధ్య వాహనదారులు వాహనాలు నడుపుతున్నారు. చీకట్లో రోడ్డు ప్రమాదాలు జరిగిన రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో పోలీసులు కూడా తమ ఫోన్‌లలో లైట్ వేసి ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సుడా పరిధిలో రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పూర్తి స్థాయిలో పనిచేసేవిధంగా మరమ్మతులు చేయాలని రోడ్డు వెంట ఉన్న గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

19న ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉమ్మడి కరీంనగర్ జిల్లా (పెద్దపల్లి మినహా) సీనియర్స్ మహిళలు, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వై.మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో 17 సంవత్సరాలు నిండిన పురుషులు, 15 సంవత్సరాలు నిండిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను పెద్దపల్లిలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా తగ్గిన వరద

● 8 గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడం మంగళవారం స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి 22,290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, సరస్వతి కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 22,290 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఈ యేడాది జూన్ 1వ నుంచి 869.039 టీఎంసీల నీరు వచ్చింది.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి నవంబరు 5 వరకు మూగజీవాలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న అవగాహన, 16న మొగ్దుంపూర్, 17నల్లగుంటపల్లి, 18న దుర్శేడ్, 21న చేగుర్తి, 22ఇరుకుల్ల, 23న చెర్ల బూత్కూర్, 24న చామనపల్లి, 25న బహదూర్‌ఖాన్‌పేట, దుబ్బపల్లి,27న ఎలబోతారం, 28న ఫకీర్‌పేట, 29న జూబ్లీనగర్, 30న నగునూర్, 31న తహెర్ కొండాపూర్, విలీన గ్రామాల్లో నవంబరు 1న వల్లంపహాడ్, 3న ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, 4,5 తేదీల్లో బొమ్మకల్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వరుణ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ అన్నారు. మంగళవారం మండలంలోని వావిలాల గ్రామ రైతు వేదికలో పలు శాఖల వారికి సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ఏఈవో అర్చన, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో..

మానకొండూర్ : సీపీఆర్‌పై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎంపీడీవో వరలక్ష్మీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సిపిఆర్‌పై మానకొండూర్ ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంపిడివో వరలక్ష్మీ మాట్లాడుతూ ఎవరికైనా శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న సందర్భంలో సీపీఆర్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు సాయిప్రసాద్, ఎండీ సల్మాన్, సీహెచ్‌వో రాజునాయక్, జుబేరు, మునీందర్ సిబ్బంది ఉన్నారు.

నగర సమస్యలపై కాంగ్రెస్ నేతల ఏకరువు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అనేక సమస్యలపై కాంగ్రెస్ నేతలు ఏకరువు పెట్టారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావుతోపాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్‌ని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు వారివారి డివిజన్‌లో నెలకొన్న సమస్యలతోపాటు నగరపాలక సంస్థలో పని చేస్తున్న జవాన్ల అంతర్గత బదిలీల విషయమై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నగర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

క్రీడాకారులకు సీపీ అభినందనలు



అభినందిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరాటే క్రీడాకారులను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అభినందించారు. జిల్లాకు చెందిన కరాటే క్రీడాకారులు అన్వర్‌ఖాన్, అర్మాన్‌ఖాన్, పర్హాన్‌ఖాన్ చెన్నైలో ఇటీవల నిర్వహించిన గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, బుద్ధి ధర్మం వరల్డ్ రికార్డ్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కార్యాలయంలో సీపీ గౌస్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో దేశం గర్వపడేలా చదువుతోపాటు కరాటేలో రాణించాలని సూచించారు. ఐజీకేఏ గ్రాండ్ మాస్టర్ అక్బర్‌ఖాన్, పహ్మిదా ఖాటూన్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి గ్రస్తులకు సంరక్షణ కిట్ల పంపిణీ

సుభాష్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ నాగభూషణం వర్ధంతి సందర్భంగా డాక్టర్ రఘురామన్ షుగర్ వ్యాధిగ్రస్తులకు సంరక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఆరోగ్య సంరక్షణపై మంగళవారం ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ దారం సుజాత, ట్రైనర్ కళావతి పాల్గొన్నారు.

దోనపాటి శ్రీకాంత్‌రెడ్డికి డాక్టరేట్

రామడుగు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసాయిపల్లి గ్రామానికి చెందిన దోనపాటి శ్రీకాంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. డాటా ప్రైవసీ ప్రొటెక్షన్ బేస్డ్ ఆన్ మైక్రోఅగ్రిగేషన్ యూసింగ్ మెషిన్ లర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన చేసి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ అందు కున్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన శ్రీకాంత్‌రెడ్డి ఎల్‌అండ్‌టీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుడిగా పనిచేశారు.

వేదభవనం విద్యార్థులకు వైద్య పరీక్షలు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాసతరంగిణి ఆధ్వర్యంలో నగర శివారులోని వేదభవనంలో మంగళవారం వేద విద్యార్థులకు సీవీఎం హాస్పిటల్ డాక్టర్ చాట్ల శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురు డాక్టర్లు, సిబ్బంది విద్యార్థుల అనారోగ్య సమస్యలు, ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. మందులు అందజేశారు. చలికాలం కావడంతో జాగ్రత్తగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. రోజూ వ్యాయామం, యోగా చేయాలని తెలిపారు.

రచనలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రచయిత పొన్నం రవిచంద్ర షష్ఠ్యబ్ది అభినందన సంచిక కోసం రచనలను ఆహ్వానిస్తున్నట్లు రచయిత, ఉపాధ్యాయుడు కూకట్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సంచిక త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో రవిచంద్రతో కలసి పని చేసిన లేదా అనుబంధమున్న రచయితలు వ్యాసాలు, పద్యాలు, కవితలను పంపాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9949247591 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఏటి మధూకర్ కుటుంబానికి పరామర్శ

భగత్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా వేములపల్లి సీల్వాయిలో బీజేపీ మడల అధ్యక్షుడు ఏటి మధూకర్ కుటుంబాన్ని కరీంనగర్ జిల్లా బీజేపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, బత్తుల లక్ష్మీనారాయణ, పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్లాల నిర్మాణానికి ప్రోత్సాహమేది?

- రెండేళ్లుగా నిధులు ఇవ్వని ప్రభుత్వం

- రోడ్లపైనే ఆరబోస్తున్న రైతులు

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): పండించిన ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాల నిర్మాణానికి ప్రోత్సాహం కరువవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు, రోడ్లపై ధాన్యం కుప్పలు నేర్పుతున్నారు. గతంలో పొలాల్లో రైతులు కల్లాలను నిర్మించుకునేందుకు ఉపాధి హామీ పథకం కింద అవకాశం కల్పించారు రెండేళ్లుగా నిధులు ఇవ్వకపోవడంతో రైతులు నిరీక్షిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు పూర్తి ఉచితం కాగా,



చామనపల్లి రోడ్డుపై పోసిన ధాన్యం (ఫైల్)

మిగతా రైతులకు 10శాతం సబ్సిడీ ఇచ్చే వారు. కొంత మంది ముందుగా కల్లాలు నిర్మించుకున్నా బిల్లులు ఆలస్యంగా మంజూరవడంతో మిగతా రైతులు ముందుకు రాలేకపోయారు. మరో పది, పదిహేను రోజుల్లో వరి కోతలు ప్రారంభంకానున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా స్థలం లేక ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ ఆరబోస్తున్నారు. కరీంనగర్ సహకార సంఘం ఆధ్వర్యంలో 11, దుర్శేడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో 6, ఐకేపీ ఆధ్వర్యంలో 3 కేంద్రాలను నిర్వహిస్తారు. స్థలాలు కరువవడంతో రైతులు ధాన్యాన్ని సమీపంలోని రోడ్లపై పోస్తుంటారు. చామనపల్లిలో రోడ్డుతోపాటు, క్రీడా ప్రాంగణం, చెర్లబూత్కూర్, జూబ్లీనగర్ క్రీడా ప్రాంగణంతో పాటు రోడ్లపై ధాన్యం కుప్పలు పోస్తారు. ఆ కుప్పలపై టార్పిలిన్లు కప్పి, రాళ్లపెడతారు. రాత్రి వేళల్లో కనిపించక వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు ఉన్నాయి.

ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 వాలీబాల్ టోర్నమెంట్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో అండర్-19 బాలబాలికల వాలీబాల్ జిల్లాస్థాయి టోర్నమెంట్ మండలంలోని శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ప్రారంభమైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 55 జట్లు పాల్గొనగా రెండు రోజులపాటు ఈ టోర్నమెంట్ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ఐ సెక్రెటరీ వేణుగోపాల్ టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు శ్రీ చైతన్య కళాశాల వేదికకావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామీణస్థాయి నుంచి వచ్చిన సింధూ అనే కరీంనగర్‌కు చెందిన క్రీడాకారిణి వాలీబాల్‌లో ఇండియా టీమ్‌కు ఎంపికవడం గర్వకారణమన్నారు. క్రీడకారులకు రాష్ట్ర ప్రభుత్వం 2శాతం ఉపాధి, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా కల్పించిందన్నారు. క్రీడాకారులు చదువుతోపాటు క్రమ శిక్షణను కలిగి ఉండాలని సూచించారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలల డీన్ జగన్మోహన్‌రెడ్డి, డిఫెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

భగత్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం ఎలగందల్ మోడల్ స్కూల్‌లో మంగళవారం పోషణ మాసంలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావిక మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి పెంపొందాలంటే జామ, నిమ్మ, బత్తాయి వంటి పండ్లు తీసుకోవాలని, వాటిల్లో విటమిన్ -సి ఉంటుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు పౌష్టికాహారంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో ఆనందం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అరుణ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

కరీంనగర్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యతని డీఈవో మొండయ్య, ఏఎంవో అశోక్‌రెడ్డి, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ అంబర్ సింగ్ అన్నారు. వాణీనికేత్ కిడ్స్ కేర్ హాల్‌లో రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ మండలి సంస్థ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం మాట్లాడారు. మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించుకోవచ్చన్నారు. ప్రతీ రంగానికి చెందిన అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఆకర్షణకు గురై పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాల్లో చిక్కుకుపోతున్నారని, ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 32 వేల మంది అమ్మాయిలు, మహిళలను కాపాడామని అన్నారు. అనంతరం మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కృష్ణవేణి, సయ్యద్ ఇర్షాద్‌అలీ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో సుదీర్ఘ ప్రయాణం : వెలిచాల

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలంగా పని చేస్తున్నాని పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. 1981లో పార్టీలో తన ప్రస్థానం మొదలైందని, 1986లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రయూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, సంయుక్త కార్యదర్శిగా పని చేశానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుదీర్‌కుమార్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. 1987 కరీంనగర్ జిల్లా గుండి గోపాలరావుపేట సింగిల్ విండో చైర్మన్‌గా, ఆ తర్వాత కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశానన్నారు. నెడ్ క్యాపు స్టేట్ డైరెక్టర్‌గా రాష్ట్ర చాంబర్ ఆఫ్ మార్కెట్ కమిటీ చైర్మన్ల అసోసియేషన్ చైర్ పర్సన్‌గా పని చేశానన్నారు. అనివార్యకారణాలతో వేరే పార్టీలోకి వెళ్లి 2017లో తిరిగి కాంగ్రెస్‌లో చేరానన్నారు. అప్పటినుంచి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. 2024లో అధిష్టానం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించిందని, రాబోయే రోజుల్లో ఏ బాధ్యత అప్పగించినా బాధ్యతాయుతంగా పనిచేస్తానని తెలిపారు.

● న్యూస్‌బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఫీడర్ పరిధిలోని కొత్తపల్లి హవేలి, తూరుపువాడలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏడీఈ రాజు ప్రకటనలో తెలిపారు. మరమ్మతు దృష్ట్యా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు దళిత జేఏసీ ఆధ్వర్యంలో దీక్ష

సుభాష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి గవాయిపై దాడికి నిరసనగా దళిత జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టనున్నట్లు జేఏసీ నాయకుడు సీనియర్ అడ్వకేట్ కొరివి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

చేతిరాత పోటీలు

సైదాపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చేతిరాత పోటీలు నిర్వహించారు. మంచి రాత కలిగిన 10మంది విద్యార్థులకు డిక్షనరీలను అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్, ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నకూటోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కన్నుల పండువగా
బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహ స్వామిక్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహన, పూలంగి, అష్టదళపాదపద్మారాధన, అన్నకూటోత్సవ సేవలు, సాయంత్రం మహా శాంతి హోమం, రాత్రి సహస్రదీపాలంకరణ, గజవాహనసేవలు నిర్వహించారు. సర్వవైదిక సంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం సందర్శించారు. విద్యార్థుల ఎదుగుదల, రోజువారీ మెనూ, పిల్లల హాజరు నమోదు, గర్భిణులు, బాలింతల సంఖ్య వంటి వివరాలను తెలు సుకున్నారు. పిల్లల హాజరు శాతాన్ని పెం చాలన్నారు. పౌష్టికాహారం అందరికీ అందాలన్నారు.

నగరంలోని విద్యానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే తనిఖీ చేశారు. ఓపీడీ, ఎన్‌సీడీ, ఆరోగ్య మహిళ, ఐఎల్‌ఆర్ ల్యాబ్, ఫార్మసీ సేవలను పరిశీలించారు. తగు సూచనలు చేశారు.



పిల్లలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సమర్థులకే పార్టీ నాయకత్వ బాధ్యతలు

- ఏఐసీసీ పరిశీలకుడు శ్రీనివాస్ మనె



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు శ్రీనివాస్ మనె

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమర్థులకే పార్టీ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని ఏఐసీసీ పరిశీలకుడు మానె శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపిక కోసం మంగళవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో అరుందతీ ఫంక్షన్ హాల్‌లో పార్టీ శ్రేణుల అభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ ప్రతనిధి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్, ఇతర నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభిప్రాయం మేరకే నియామకం

గంగాధర: కార్యకర్తల అభిప్రాయం మేరకే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని నియమాకం జరుగుతుందని ఏఐసీసీ అబ్జర్వర్ మన్నె శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గంగాధర శుభమస్తు ఫంక్షన్ హాల్లో గంగాధర, రామడుగు, చొప్పదండి, బోయినపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ అబ్జర్వర్లు ఆత్రం సుగుణ,ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, చొప్పదండి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మహేష్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహి ళాధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నరెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పులి ఆంజనేయులుగౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి అధ్యక్ష పదవి ఇవ్వాలి

కరీంనగర్ అర్బన్: ప్రముఖ విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ ఏఐసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్ మనెకు జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ మంగళవారం డీసీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిమ్ ఫహద్ మాట్లాడుతూ నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి పార్టీకి అంకిత భావంతో పని చేస్తున్నారని, కరీంనగర్‌లోని వివిధ విభాగాల కార్యకర్తలతో కలిసి పార్టీ పటిష్టతకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో స్వల్ప ఓట్లతో ఓడారని, అయినా ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలను తెలుసుకుంటున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారని అన్నారు. యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ అజీమ్, రాచర్ల శ్రీనివాస్, నయీముద్దీన్, ఆసిఫ్, సిద్ధూ, రవి, శ్రీకాంత్,అనిల్, రవితేజ, ప్రశాంత్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలి

ఇల్లందకుంట: డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడెపు సారంగపాణి మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ అబ్జర్వర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ 33 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని కృషి చేశానన్నారు. అబ్జర్వర్ శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ప్రెస్ క్లబ్ భవన నిర్మాణ పనుల పరిశీలన

గంగాధర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాన్ని మంగళవారం ఎంపీడీవో రాము, ఎంపీవో గౌరీ రమేష్‌లు పరిశీలించారు. స్లాబ్ లెవల్ పూర్తికాగా పనులు వేగవంతం చేయాలని, క్యూరింగ్, పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట కార్యదర్శి లచ్చయ్య తదితరులున్నారు.

ఆర్థికసాయం

ఇల్లందకుంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన రామంచ సుక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం పదోతరగతి మిత్రులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

దళిత సంఘాల నిరసన

సుల్తానాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై బూటు విసిరిన సంఘటనను నిరసిస్తూ సుల్తానాబాద్‌లో దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించాయి. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం వినతి పత్రాన్ని సమర్పించాయి.

పోషణ్ మాసోత్సవాలు



స్టాళ్లను పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో, ఆర్డీవో, ఏసీపీ

హుజూరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ్ మాసోత్సవాలు నిర్వహించారు. డీడబ్ల్యూవో సరస్వతి, ఆర్డీవో రమేష్‌బాబు, ఏసీపీ మాదవి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టాళ్లను పరిశీలించారు. సీడీపీవో సుగుణ, ఐసీడీపీవో ప్రవళిక, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

● విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా శస్త్ర పబ్లిక్ స్కూల్‌కు చెందిన 5వ తరగతి చదువుతున్న బావు సుదీక్ష ప్రథమ బహుమతి సాధించింది. విద్యార్థిని అధికారులు అభినందించారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

సుభాష్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఎన్ రావు ఫౌండేషన్, నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు మాట్లాడుతూ శిక్షణ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం ఎన్‌ఏసీ(న్యాక్) అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి దోహదం చేస్తాయ న్నారు. ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ ఝాన్సి, డాక్టర్ పొలాస రాంకిరణ్, గంగ తదితరులు పాల్గొన్నారు.



స్వయం ఉపాధిపై వివరిస్తున్న డాక్టర్ బీఎన్ రావు

బీజేపీ నాయకులపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జమ్మికుంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కౌశిక్‌రెడ్డిపై అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. చిలుముల రామస్వామి, ఎండీ జానీ, మొలుగూరి వసంత్, మంద రాజేష్, పొనగంటి శ్రీధర్, సందీప్ పాల్గొన్నారు.